క్లుప్తంగా

అన్నదాత సుఖీభవను సద్వినియోగం చేసుకోండి

అర్ధవీడు: 2025–26 సంవత్సరానికి గాను ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకానికి మార్గదర్శకాలు విడుదల చేసిందని మండల వ్యవసాయాధికారి ఎస్కే మహమ్మద్ శని వారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఒక రైతు కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.14 వేలు, కేంద్ర ప్రభుత్వం రూ.6 వేలు చొప్పున మొత్తం రూ.20 వేలు సాగు ఖర్చుల కోసం జమ చేస్తారని తెలిపారు. ఈ డేటా తనిఖీ కోసం మే నెల 25 వరకు ఆన్‌లైన్‌లో అన్నదాత సుఖీభవ పోర్టల్‌లో వీఏఏలు నమోదు చేస్తారన్నారు. వ్యవసాయ, ఉద్యాన, సెరీకల్చరులలో సాగు భూమి ఉన్న ప్రతి రైతు అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులన్నారు. ప్రతి రైతు తమ ఆధార్‌కార్డు, భూ వివరాలతో ఆయా రైతు సేవా కేంద్రాల్లోని సహాయకుల చేత నమోదు చేయించుకోవాలని ఆయన తెలిపారు.

ఆర్టీసీలో తాత్కాలిక డ్రైవర్ల నియామకానికి అవకాశం

గిద్దలూరు రూరల్: గిద్దలూరు ఆర్టీసీ డిపోలో తాత్కాలిక డ్రైవర్లుగా పనిచేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని స్థానిక డిపో మేనేజర్ బి.చంద్రశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తాత్కాలిక ప్రాతిపదికన డిపో డ్రైవర్లుగా పనిచేసేందుకు 10 మందికి అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. అనుభవజ్ఞులైన డ్రైవర్లు వారి లైసెన్సులతో డిపోలోని అధికారులను సంప్రదించాల్సిందిగా కోరారు. పూర్తి వివరాల కోసం 9959225702 సెల్ నంబరును సంప్రదించాలన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో మదర్స్ డే వేడుకలు


తల్లులకు పాదాభివందనం చేస్తున్న చిన్నారులు

బేస్తవారిపేట: స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో మదర్స్ డే వేడుకలు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు తల్లులకు మాతృదినోత్సవ శుభాకాంక్షలు తెలియచేస్తూ పాదాభివందనం చేశారు. తల్లుల పేరుమీద మొక్కలు నాటారు. తల్లులు, పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీడీపీఓ షేక్ నీలోఫర్ బేగమ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

వీరభద్రుడికి ప్రత్యేక పూజలు


వీరభద్రస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

తర్లుపాడు: శనిత్రయోదశి పర్వదినాన్ని పురస్కరించుకుని తర్లుపాడు వీరభద్రస్వామి దేవస్థానంలో శనివారం స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు లక్ష్మీకేశవరావు వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి అష్టోత్తర శతనామావళి, మహా నైవేద్యం, మంగళహారతి తదితర పూజలు చేశారు.

విజయోస్తు

- పశ్చిమ ప్రకాశంలో 10 నుంచి 12 వేల మంది వరకూ సైన్యంలో విధులు
- మార్కాపురం పరిసర గ్రామాల్లో 1500 మందికిపైగా సైనికులు
- పాకిస్థాన్‌పై విజయం మనదే
- కార్గిల్ యుద్ధవీరుల మనోగతం


మార్కాపురంలో భారత్ సైనికులకు విజయోస్తు అంటున్న మాజీ సైనికులు

మార్కాపురం:

సిందూర్ 2.0కు పశ్చిమ ప్రకాశంలో సైనికులు పాలుపంచుకుంటున్నారు. అణువణువునా దేశ భక్తిని నింపుకుని దేశ రక్షణ కోసం ప్రాణాలను పణంగా పెట్టి తుపాకులు చేతపట్టి సన్నద్ధమయ్యారు. సైనికులకు వారి కుటుంబ సభ్యులు వీర తిలకం దిద్ది ముందుకు సాగాలని ధైర్యం నూరిపోస్తున్నారు. జమ్మూకాశ్మీర్ సరిహద్దుల్లో, రాజస్థాన్ సరిహద్దుల్లో, పంజాబ్ బార్డర్‌లో, దేశ సరిహద్దుల వెంట జల, వాయు, భూతల పోరులో భాగస్వాములవుతున్నారు. పశ్చిమ ప్రకాశంలో మొత్తం 10 నుంచి 12 వేల మంది వరకూ సైన్యంలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఒక్క మార్కాపురం పట్టణంతోపాటు పరిసర గ్రామాల్లోనే 1500 మంది వరకూ యువకులు సైన్యంలో ఉన్నారు. ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనే సత్తా మనకుందంటూ కార్గిల్ యుద్ధవీరులు, మాజీ సైనికులు భరోసా వ్యక్తం చేశారు. దాయాది దేశమైన పాకిస్థాన్ కంటే అన్నివిధాలా సైన్యం, యుద్ధ సామగ్రి విషయంలో మనమే ఎక్కువ అని తెలిపారు.

ఉగ్రవాదులను వదిలిపెట్టకూడదు



ఉగ్రవాదులను వదిలిపెట్టకూడదు. మనకున్న సైనిక సంపత్తి ముందు దాయాది దేశ సైనిక సామగ్రి చాలా తక్కువ. పెహల్గాంలో ఉగ్రవాదులు పర్యాటకులను కాల్చిచంపడం చాలా దారుణం. ఈ దాడికి పాల్పడిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాల్సిందే. ఈ విషయంలో మేమంతా మన దేశానికి మద్దతుగా నిలుస్తాం. మన సైనిక స్థాయి ముందు పాకిస్థాన్ ఏ దశలోనూ పోటీరాదు. అవసరమైతే మాజీ సైనికులమైన మేము యుద్ధానికి సిద్ధం. మా సేవలు ఏవిధంగానైనా అందించేందుకు సిద్ధంగా ఉన్నాం.

– శేషసాయి, మాజీ సైనిక ఆఫీసరు

విజయం మనదే



నా భర్త నక్కా వెంకట ప్రసాద్ ప్రస్తుతం సరిహద్దుల్లో నాయక్ సుబేదార్‌గా యుద్ధంలో ఉన్నాడు. దేశ రక్షణలో పాల్గొనడం సంతోషంగా ఉంది. నా భర్తకు ధైర్యం చెప్పాను. విజయం మనదే. మన సైనికుల శక్తిసామర్థ్యాల ముందు పాకిస్థాన్ సైనికుల శక్తి ఏమాత్రం సరిపోదు. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాల్సిందే.

– ఎస్.విజయలక్ష్మి, సైనికుని భార్య

భారత్‌దే పైచేయి



నేను భారత సైన్యంలో సుబేదార్ మేజర్‌గా పనిచేశాను. నాడు కార్గిల్ యుద్ధ సమయంలో మేజర్‌గా సుమారు 400 నుంచి 500 మంది సైనికులను ముందుకు నడిపించి పాకిస్థాన్ సైన్యం, ఉగ్రవాదులతో పోరాడి వారి పీచమణిచాం. యుద్ధం ఎప్పుడు వచ్చినా విజయం మనదే.

– శీలం హరినారాయణరెడ్డి, సుబేదార్ మేజర్, మార్కాపురం

కచ్చితంగా ఓడిపోతారు



నేను సైన్యంలో 27 సంవత్సరాలు పనిచేశాను. కార్గిల్ యుద్ధంలో పాల్గొన్నాను. పాకిస్థాన్‌ను ఆనాటి యుద్ధంలో మట్టి కరిపించాం. శత్రుదేశానికి వెళ్లి ఉగ్రవాదులను తుదముట్టించాం. ఇప్పుడు జరుగుతున్న ఉగ్రవాద పోరులో కూడా మనమే గెలుస్తాం. పాకిస్థాన్ కచ్చితంగా ఓడిపోతుంది.

– సతికల రామకృష్ణ, నాయక్ సుబేదార్, ఫౌండర్ మాజీసైనికుల సంఘం మార్కాపురం

సింధూర్‌లో విజయం మనదే



ప్రస్తుతం పాకిస్థాన్‌తో జరుగుతున్న సిందూర్ 2.0 పోరులో కచ్చితంగా విజయం సాధిస్తాం. భవిష్యత్తులో ఉగ్రవాదులు భారత్‌లోకి రావాలంటే భయపడేలా మన సైన్యం బుద్ధి చెబుతారు. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి. పాకిస్థాన్ పౌరనివాసాలపై దాడులు చేయడం శోచనీయం. ఇప్పటికైనా పాకిస్థాన్‌లో ఉగ్రవాదాన్ని తొలగించాలి.

– గిరి వెంకటరమణ, హవాల్దార్

ఖాళీ ప్లాట్లపై కన్ను


పోలేరమ్మ గుడి ప్రాంతంలో ఖాళీగా ఉన్న ప్లాట్లు

- అధికార పార్టీ నేతలు భూదందాకు యత్నం

మార్కాపురం: ఖాళీ స్థలం కనిపిస్తే అధికార పార్టీ నేతలు వాలిపోతున్నారు. వివరాల్లోకి వెళితే..మార్కాపురం పట్టణ శివార్లలోని, తర్లుపాడు రోడ్డులో అల్లూరిపోలేరమ్మ గుడి వెనుక 2004లో ప్రభుత్వం సుమారు 150 మందికిపైగా పేదలకు పట్టాలిచ్చింది. అయితే అప్పట్లో ఈ స్థలాలు ఊరికి దూరంగా ఉండటంతో పలువురు నివాస గృహాలు కట్టుకోలేదు. సర్వే నంబర్ 1బీ లో మొత్తం 180 ప్లాట్లు ఉన్నాయి. సుమారు 70 మందికిపైగా గృహాలను కట్టుకోగా మరికొంత మంది స్థలాలను ఖాళీగా ఉంచుకున్నారు. ఈ ఖాళీ ప్లాట్లపై అధికార పార్టీలో ద్వితీయ శ్రేణి నాయకులతో పాటు పలువురు రియల్ ఎస్టేట్ వ్యాపారుల దృష్టిపడింది. నయానో.. భయానో బెదిరించుకుని ఖాళీ స్థలాలను కబ్జా చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ప్రస్తుతం అక్కడ 100 గజాల ప్లాట్ విలువ రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు పలుకుతోంది. దీంతో పలువురి నాయకుల కన్ను ఆ ప్లాట్లపై పడి కంచె వేసేందుకు ప్రయత్నిస్తున్నారు. విషయం తెలుసుకున్న లబ్ధిదారులు అక్కడికి వెళ్లి తమ స్థలాల చుట్టూ తాత్కాలికంగా కబ్జాదారులు వేసిన కంచెను తొలగిస్తున్నారు. సుమారు 30 నుంచి 50 ప్లాట్లలో ఎటువంటి గృహాలు నిర్మించుకోకపోవడంతో వాటిపై తమ్ముళ్లు కన్నేశారు. గత వారం రోజుల నుంచి పట్టణంలో ఈ కబ్జాల పర్వం హాట్‌టాపిక్‌గా మారింది. దీంతో పట్టాలున్న లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

ఆక్రమిస్తే కఠిన చర్యలు: చిరంజీవి, తహశీల్దార్, మార్కాపురం

అల్లూరిపోలేరమ్మ గుడి ప్రాంతంలో ఉన్న ప్లాట్లను ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. 2004లో కొంతమందికి ప్లాట్లు ఇవ్వగా వారు ఇళ్లు కట్టుకోలేదు. వారందరికీ నోటీసులు ఇస్తాం. ఎవరూ దళారుల మాటలు నమ్మి ఆ పాట్లను కొనుగోలు చేసి ఇబ్బంది పడవద్దు. ఖాళీగా ఉన్న ప్లాట్లను పరిశీలించాను. ఇంతవరకూ ఆ ప్లాట్లు ఎవ్వరూ ఆక్రమించలేదని తెలిసింది.

నేడు గ్రంథాలయంలో మాతృ దినోత్సవం

గిద్దలూరు రూరల్: పట్టణంలోని గ్రంథాలయంలో ఆదివారం ఉదయం 9 గంటలకు మాతృదినోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రంథపాలకురాలు ఎస్.ప్రసన్నకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 10వ తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానిస్తారన్నారు. కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాల్సిందిగా ఆమె కోరారు.

వృద్ధురాలి మృతిపై పోలీసులకు ఫిర్యాదు


మృతిచెందిన వృద్ధురాలు

కంభం: మండలంలోని దరగా గ్రామంలో గొర్రె వెంకట లక్ష్మమ్మ (74) అనే వృద్ధురాలు మృతిచెందడంపై బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే గొర్రె వెంకట లక్ష్మమ్మ గ్రామంలో ఒంటరిగా నివశిస్తోంది. శుక్రవారం సాయంత్రం వృద్ధురాలి ఇంటికి పాలుపోసే అమ్మాయి వెళ్లగా మంచంపై వృద్ధురాలు మృతి చెంది ఉండటం గమనించి బంధువులకు సమాచారం అందించింది. శనివారం హైదరాబాద్ నుంచి బంధువులు వచ్చి చూడగా మృతురాలి చేతికి చీమలు పట్టి రక్తం వచ్చినట్లు కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

13న విద్యుత్ సమస్యలపై అదాలత్

కురిచేడు: విద్యుత్ అదాలత్, వినియోగదారుల అవగాహన సదస్సు ఈ నెల 13న పొదిలిలో నిర్వహించనున్నట్లు ఏడీఈ హరిబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారుల గ్రీవెన్స్ రీ డ్రెస్సెల్ ఫోరం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి సీజీఆర్ఎఫ్ చైర్మన్ జస్టిస్ విక్టర్ ఇమ్మానియేల్, ఫోరం సభ్యులు, ఒంగోలు ఆపరేషన్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, దర్శి ఈఈ శ్రీనివాసులు, ఇతర విద్యుత్ అధికారులు హాజరవుతారని తెలిపారు. ఈ అవకాశాన్ని దర్శి విద్యుత్ డివిజన్ పరిధిలోని పొదిలి, దర్శి, దొనకొండ, కొనకనమిట్ల, మర్రిపూడి, తాళ్లూరు, ముండ్లమూరు, కురిచేడు తదితర మండలాల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు తమ ఫిర్యాదులను రాతపూర్వకంగా తెలియజేయాలని ఆయన సూచించారు. సర్వీస్ కనెక్షన్ సెంటర్ పూర్తి అడ్రసు, సెల్ నెంబరుతో అర్జీ సమర్పించి తమ సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు.

ఘనంగా అంతర్జాతీయ తల్లుల దినోత్సవం

యర్రగొండపాలెం: మండలంలోని కొత్తగోళ్లవిడిపిలో ముందస్తు అంతర్జాతీయ తల్లుల దినోత్సవాన్ని శనివారం ఘనంగా జరుపుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న తల్లులకు చిన్నారులు పాదాభివందనాలు చేసి వారి నుంచి ఆశీస్సులు అందుకున్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త పూజల మూర్తెమ్మ పాల్గొన్నారు.

వర్షంతో ఉపశమనం


పంచాయతీ కార్యాలయం వద్ద వర్షం నీరు

కొనకనమిట్ల: ఉదయం నుంచే ఒకటే ఎండ వేడిమికి ఇబ్బందులు పడ్డ ప్రజలకు సాయంత్రం ఒక్కసారిగా మేఘావృతమై వరషం కురవడంతో కాస్త ఉపశమనం పొందారు. వర్షానికి గొట్లగట్టు పంచాయతీ కార్యాలయం వద్ద, మెయిన్‌రోడ్డు స్పీక్ బ్రేకర్ వద్ద వర్షంనీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఈనెలలో ఇంకో రెండు వర్షాలు కురిస్తే పొలాలు పదునెక్కుతాయని రైతులంటున్నారు.

హనుమాన్ శోభాయాత్రకు హాజరుకావాలి


ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న అన్నా రాంబాబు

- అన్నాను ఆహ్వానించిన కమిటీ సభ్యులు

మార్కాపురం: మార్కాపురంలో ఈనెల 22న జరిగే హనుమాన్ శోభాయాత్రకు హాజరుకావాలని హనుమాన్ శోభాయాత్ర కమిటీ సభ్యులు మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబుకు ఆహ్వానపత్రికను అందించారు. శోభాయాత్ర ఈనెల 22 గురువారం సాయంత్రం 4 గంటలకు పట్టణంలోని తర్లుపాడు రోడ్డులోని ఆంజనేయస్వామి గుడి నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఇమ్మడిశెట్టి వీరారావు, డి.చంద్రశేఖర్, వెంకట్, రంగస్వామిగౌడ్, అంజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

25న ఎంపీజే ప్రాంతీయ మహాసభ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అబ్దుల్ రజాక్

మార్కాపురం: మూవ్‌మెంట్ పీస్ అండ్ జస్టిస్ (యంపీజే) ప్రకాశం, పల్నాడు, గుంటూరు, ఎన్‌టీఆర్ కృష్ణా జిల్లాల ప్రాంతీయ మహాసభ ఈ నెల 25న గుంటూరులో నిర్వహించనున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ తెలిపారు. మార్కాపురం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం వాల్ పోస్టర్ ఆవిష్కరణలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలో రోజు రోజుకు పెరుగుతున్న మతోన్మాదం, లంచగొండితనం, అంటరానితనాన్ని నిర్మూలించేందుకు యంపీజే కృషి చేస్తుందన్నారు. ప్రస్తుతం కొన్ని శక్తులు సోషల్ మీడియా వేదికగా ఒక మతానికి వ్యతిరేకంగా విషం కక్కుతున్నారని, వారు వాస్తవాలు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు షేక్ అబ్దుల్ రసూల్, షేక్ ఖాశీం, మస్తాన్‌వలి, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు


ఏకాంతసేవ ఉత్సవంలో శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి

కొనకనమిట్ల: మండలంలోని పెదారికట్లలో నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి, పార్వతి సమేత రాజనగరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శనివారంతో ముగిశాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామికి ఏకాంతసేవ భక్తుల జయజయ ధ్వానాలతో వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య మంగళ వాయిద్యాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన వాహనంలో శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి విగ్రహాలను ఉంచి గ్రామంలో ఉత్సవం నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామికి నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమానికి ఉభయ దాతలుగా చిన్నమద్దూరి, రాజాల, బొల్లావుల, వరికూటి కుటుంబాలకు చెందిన దంపతులు వ్యవహరించారు. వేదపండితులు నంద్యాల వెంకటకృష్ణకిరన్, నుదురుపాటి వెంకటకృష్ణారావు స్వామికి అర్చనలు, అభిషేకాలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. 12 రోజులుగా బంధుమిత్రుల రాకతో గ్రామంలో సందడి నెలకొంది.


ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

భక్తిశ్రద్ధలతో మహాసంప్రోక్షణ

- 12 ఏళ్ల తరువాత శ్రీవారి ఆలయంలో ప్రత్యేక పూజలు


స్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

మార్కాపురం టౌన్: పట్టణ శివార్లలోని జంకె రామిరెడ్డి నగర్‌లో ఉన్న శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టబంధన మహా సంప్రోక్షణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలలో నిర్వహించారు. స్వామి నిజరూప పాద స్పర్శదర్శనాన్ని పలువురు భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. ప్రతి 12 ఏళ్లకు ఒకసారి స్వామి ఆలయంలో అష్టబంధన మహా సంప్రోక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు చక్కా మాలకొండ నరసింహరావు, ఉటూకూరి రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. మార్కాపురం పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచి పలువురు భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కమిటీ సభ్యులు ఏరువ దేవిరెడ్డి, డీవీఆర్ పాల్గొన్నారు. అర్చకులు అంగరవెంకట కనక నరసింహాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక పూజల్లో స్వవిని ప్రత్యేకంగా అలంకరించారు.

‘సిందూర్’ విజయవంతం కావాలని పూజలు


చెన్నకేశవస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న నాయకులు

మార్కాపురం: పెహల్గాం ఉగ్రవాద దాడిలో పాల్గొన్న వారిని కఠినంగా శిక్షించేందుకు భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని కోరుతూ బీజేపీ నాయకులు శనివారం శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పాక్ మూకలను మట్టుబెట్టే శక్తి, మనోధైర్యం భారత సైనికులకు ఇవ్వాలని దేవుడిని ప్రార్థించారు. ఉగ్రవాదం పూర్తిగా నశించాలని స్వామివారికి పూజలు చేసినట్లు బీజేపీ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు, పట్టణ అధ్యక్షుడు పాదర్తి ఆంజనేయులు తెలిపారు.


గనివానిపాడు చెరువును తలపిస్తున్న పొలాల్లో వర్షం నీరు


గనివానిపాడు, వాగుమడుగు మధ్యలో కోతకు గురైన చప్టా

గనివానిపాడులో జోరువాన

- గ్రామాన్ని చుట్టుముట్టిన వర్షం నీరు
- గనివానిపాడు, వాగుమడుగు రహదారి మధ్యలో తెగిన చప్టా


గనివానిపాడులో చుట్టు ముట్టిన వర్షం నీరు

కొనకనమిట్ల: వాతావరణ ప్రభావంతో శనివారం సాయంత్రం మండలంలోని గనివానిపాడులో గంట పాటు జోరు వాన కురిసింది. ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో వర్షం నీరు గ్రామాన్ని చుట్టుముట్టాయి. పొలాలు నీటితో నిండాయి. రేకుల షెడ్‌లో ఉన్న పొగాకు బేళ్లు తడిసి ముద్దయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గాలివానకు వీధులన్నీ జలమయమయ్యాయి. గనివానిపాడు–వాగుమడుగు రహదారి మధ్యలోని చప్టా వర్షం ధాటికి కోతకు గురై వర్షం నీరు పారింది. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. పలు చోట్ల అరటి, బొప్పాయి తోటలకు ఈ వర్షం నష్టం చేకూరుస్తుందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మార్కాపురం డివిజన్
99516 02963 (మార్కాపురం)
99122 25435 (గిద్దలూరు)
Office mail : sakshiongads@gmail.com